క్లుప్తంగా

జామియా మసీద్ సందర్శించిన ఎస్పీ



స్టేషన్ మహబూబ్‌నగర్: ఎస్పీ నరసింహ శుక్రవారం రాత్రి జిల్లా కేంద్రంలోని జామియా మసీద్‌ను సందర్శించారు. రంజాన్‌మాసం నేపథ్యంలో మసీద్‌ను సందర్శించి ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

బాల కవి సమ్మేళనం

జడ్చర్ల టౌన్: పట్టణంలోని ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం సంస్కారభారతి ఆధ్వర్యంలో ఉగాదిని పురస్కరించుకుని బాల కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్కారభారతి సభ్యుడు గోనెల రాధాకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు భాషపై పట్టు సాధించాలని పిలుపునిచ్చారు. కవిత్వంపై సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో సంస్కార భారతి సభ్యులు రమేష్, ఉమెన్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షురాలు బాలమణి, హెచ్‌ఎం శారద పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలి

జడ్చర్ల టౌన్: మున్సిపల్ కార్మికులకు సకాలంలో జీతాలు చెల్లించాలని బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో శుక్రవారం కమిషనర్ మహమూద్‌షేక్‌కు వినతిపత్రం అందజేశారు. వేతనాలు రాక కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీజేపి ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధి హరిబాబు కమిషనర్‌కు వివరించారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాయకులు జగదీశ్‌సింగ్, కుమార్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ప్యూరీఫైర్ వితరణ



జడ్చర్ల టౌన్: శుద్ధిచేసిన నీటిని తాగటం వల్ల రోగాల బారిన పడకుండా ఉంటారని ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ శ్రవణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బాదేపల్లి జెడ్పీ హైస్కూల్‌లో గంజ్‌శాఖ రూ.లక్షా 30వేలతో ఏర్పాటు చేసిన వాటర్ ప్యూరిఫైర్‌ను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో బాదేపల్లి ఎస్‌బీఐ మేనేజర్ శేషపణి, ఉపాధ్యాయులు వివేకానంద, రఘు, అబ్దుల్ అలీం, గోవింద్‌నాయక్ పాల్గొన్నారు.

చిన్నారులకు వైద్య శిబిరం



పాలమూరు: రవి ఫౌండేషన్, రవి చిన్నపిల్లల ఆస్పత్రి ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని రేగడిగడ్డ తండాలో చిన్నారులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 115మంది చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. 15మంది చిన్నారులు పలు రకాల అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు గుర్తించి వారిని రవి చిన్నపిల్లల ఆస్పత్రిలో అడ్మిట్ చేసి ఉచితంగా వైద్యం అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ శోభ, వైద్యులు దయానంద్‌రెడ్డి, మేనేజర్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్రకు ఎమ్మెల్యే సంఘీభావం

జడ్చర్ల టౌన్: ఎస్సీ వర్గీకరణ డిమాండ్‌తో మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు అలంపూర్‌లో ప్రారంభించిన మాదిగల సంగ్రామ పాదయాత్ర శుక్రవారం మండల కేంద్రం అంబేడ్కర్ చౌరస్తాకు చేరుకోవటంతో 400 కిలోమీటర్లు పూర్తి చేసుకుంది. పాదయాత్ర బృందానికి స్థానిక ఎమ్మెల్యే డా.లక్ష్మారెడ్డి స్వాగతం పలికి వారి యాత్రకు సంఘీభావం తెలిపారు. ఎమ్మెల్యేతో పాటు జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నాగరాజు, నాయకులు లింగంపేట భీంరాజ్, పాదయాత్ర బృందం ఎర్రమోని యాదగిరి, రాజు, వినోద్ పాల్గొన్నారు.

అర్హులందరికీ డబుల్ బెడ్రూం

దేవరకద్ర రూరల్: అర్హులైన పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు అందిస్తామని ఎంపీపీ రమాదేవి అన్నారు. శుక్రవారం వెంకటాయపల్లిలో 65 డబుల్ బెడ్రూం ఇంటి నిర్మాణాల కోసం భూమిపూజ నిర్వహించారు. గ్రామంలోని నిరుపేదలను గుర్తించి పారదర్శకంగా ఇళ్లను కేటాయిస్తామని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆంజనేయులు, ఎంపీటీసీ పార్వతమ్మ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జెట్టి నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ టీడీపీ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: టీడీపీ ఆధ్వర్యంలో చేపట్టిన ఇంటింటికీ టీడీపీ కార్యక్రమానికి అనూహ్య స్పందన వస్తుందని పార్లమెంటరీ అధ్యక్షుడు మెట్టుకాడి శ్రీనివాస్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో నాయకులు వెంకట్రాములు, వినోద్‌కుమార్, దత్తు, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ హయాంలోనే అభివృద్ధి



అవార్డులు అందజేస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్‌రెడ్డి తదితరులు



జడ్చర్లలో అవార్డులు అందజేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



గండేడ్‌లో అవార్డులను అందిస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

- మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- ఉత్తమ గ్రామ పంచాయతీలకు అవార్డుల అందజేత

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): బీఆర్‌ఎస్ హయాంలోనే గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాయని, సర్పంచ్‌లకు గుర్తింపు ఇచ్చిన ఘనత తమకే దక్కుతుందని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శుక్రవారం స్థానిక జెడ్పీ హాల్‌లో జాతీయ పంచాయతీ అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలో మహబూబ్‌నగర్, హన్వాడ మండలాలకు దీన్ దయాళ్ ఉపాధ్యాయ పంచాయతీ సాత్ వికాస్ పురస్కార్ కింద ఉత్తమ గ్రామ పంచాయతీలుగా ఎంపిక కావడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, డీపీఓ వెంకటేశ్వర్లు, ఎంపీపీలు బాలరాజు, సుధశ్రీ, జెడ్పీటీసీలు విజయలక్ష్మి, వెంకటేశ్వరమ్మ, వైఎస్ ఎంపీపీలు అనిత, లక్ష్మి, ఎంపీడీఓలు ధనుంజయగౌడ్, గోవిందరెడ్డి, ఎంపీఓ నరేందర్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌గౌడ్, రైతు సమితి అధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

భూత్పూర్: మండలంలోని 18 గ్రామ పంచాయతీలకు గాను 14 గ్రామ పంచాయతీలకు దీన్ దయాళ్ ఉపాధ్యాయ పంచాయతీ నేషనల్ అవార్డులు వచ్చాయి. మండల పరిషత్ కార్యాయలంలో జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్‌రెడ్డి అవార్డులను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్ గౌడ్, ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ నరేష్ గౌడ్, రైతుబంధు మండల అధ్యక్షుడు నర్సింహులు గౌడ్, ఎంపీడీఓ మున్నీ, ఎంపీఓ విజయకుమార్, సింగిల్ విండో చైర్మన్ అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

జడ్చర్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో జాతీయ పంచాయతీ అవార్డులను ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి హాజరై అందజేశారు. రాష్ట్రంలో చేపడుతున్న అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలపై దేశంలో అమలు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య, గోవర్ధన్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రణీల్, ఎంపీడీఓ ఉమాదేవి, ఎంఈఓ మంజులాదేవి తదితరులు పాల్గొన్నారు.

గండేడ్/మహమ్మదాబాద్: దేశంలోనే అభివృద్ధిలో తెలంగాణ ముందుస్థానంలో ఉందని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి తెలిపారు. ఉమ్మడి మండలంలో ఉత్తమ గ్రామ పంచాయతీలుగా ఎంపికైన వారికి అవార్డులను అందజేశారు. కేంద్ర ప్రభుత్వం కేటాయించిన 20 జాతీయ అవార్డుల్లో తెలంగాణకే 19 రావడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ మాధవి, వైస్ ఎంపీపీ ఈశ్వర్, మండల కోఆప్షన్ సభ్యుడు సలీం తదితరులు పాల్గొన్నారు.

మిడ్జిల్: మండలంలో ఉత్తమ గ్రామ పంచాయతీలకు మండల పరిషత్ కార్యాలయంలో అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ తిరుపతమ్మ, జెడ్పీటీసీ శశిరేఖ, ఎంపీడీఓ సాయిలక్ష్మి, ఎంపీఓ అనురాధ పాల్గొన్నారు.

రాజాపూర్: మండల కేంద్రంలోని రైతువేదికలో మండలంలోని 9గ్రామాల సర్పంచ్‌లకు ఉత్తమ గ్రామ పంచాయతీ అవార్డులను డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సుశీల, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బచ్చిరెడ్డి, వైస్ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, ఎంపీడీఓ లక్ష్మీదేవి, ఎంపీఓ వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.

బాలానగర్: మండలంలోని 14 గ్రామాలకు 27 మండల స్థాయి ఉత్తమ జాతీయ గ్రామ పంచాయతీ అవార్డులను రాష్ట్ర గిరిజన కోఆపరేటివ్ చైర్మన్ రామావత్ వాల్యానాయక్, ఎంపీపీ కమల చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో గిరిజన రాష్ట్ర నాయకుడు లక్ష్మణ్ నాయక్, ఎంపీడీఓ కృష్ణారావు, ఎంపీఓ నజీర్ అహ్మద్ పాల్గొన్నారు.

అడ్డాకుల: అడ్డాకుల, మూసాపేట మండలాల్లోని గ్రామ పంచాయతీలకు శుక్రవారం మండల స్థాయి ఉత్తమ గ్రామ పంచాయతీ పురస్కారాలను జెడ్పీటీసీ రాజశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ మంజుల, జెడ్పీటీసీ సభ్యుడు జి.ఇంద్రయ్యసాగర్, ఎంపీడీఓ స్వరూప పలు పురస్కారాలను అందజేశారు.

నవాబుపేట: మండల కేంద్రంలో ఉత్తమ గ్రామ పంచాయతీలుగా ఎంపికైన గ్రామాలకు ఎంపీపీ అనంతయ్య, సింగిల్‌విండో చైర్మన్ నర్సింహులు అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో మండల కోఆప్షన్ తాహేర్, ఈఓపీఆర్‌డీ భద్రునాయక్, సర్పంచ్‌లు గోపాల్‌గౌడ్, వెంకటేష్, అనిత తదితరులు పాల్గొన్నారు.



నవాబుపేటలో..



అడ్డాకులలో..

కోయిల్‌కొండ: మండల పరిషత్ కార్యాలయంలో జెడ్పీటీసీ విజయ్ భాస్కర్‌రెడ్డి, ఎంపీపీ శశికళ ఉత్తమ గ్రామ పంచాయతీలుగా ఎంపికైన వారికి అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జయరాములు, ఎంపీఓ శ్రీదేవి, సూపరింటెండెంట్ హరిశ్చంద్రారెడ్డి పాల్గొన్నారు.

అక్రమ కేసులు సరికాదు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: టీఎస్‌పీఎస్సీ లీకేజీలపై బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్న వారిపై అక్రమ కేసులు పెట్టడం సరికాదని విద్యార్థి సంఘాల నాయకుడు పులిందర్‌గౌడ్ పేర్కొన్నారు. పీయూ ఎదుట నాయకులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో నాగరాజు, రామకృష్ణ, పవన్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని లుంబిని పాఠశాలలో వ్యక్తిత్వ వికాసంపై విద్యార్థులకు మానసిక విశ్లేషకుడు మసూద్ అలీఖాన్ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ లక్ష్మణ్‌గౌడ్, ప్రిన్సిపాల్ శ్వేతాసింగ్, సారా ఉన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించండి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే మంజూరు చేయాలని యూపీఎస్సీ నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వద్ద శుక్రవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ మేరకు స్టీరింగ్ కమిటీ నాయకుడు వెంకటేష్ మాట్లాడుతూ సప్లమెంటరీ బిల్లులు, మెడికల్ బిల్లులు, పెన్షనర్ల బకాయిలు, జీపీఎఫ్ క్లయిమ్‌లు మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో రవికుమార్, కిష్టయ్య, ఉమాదేవి, రవీందర్, వెంకటేశ్వర్లు, నారాయణమ్మ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

జడ్చర్ల: మండలంలోని గంగాపూర్–నెక్కొండ రహదారిపై గురువారం రాత్రి మోటార్ సైకిల్ అదుపుతప్పి రోడ్డు ప్రమాదానికి గురై ఓ వ్యక్తి గాయాలపాలయ్యాడు. ప్రమాద విషయం తెలుసుకున్న సీఐ రమేశ్‌బాబు, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వెంటనే తమ వాహనంలో వైద్య చికిత్స కోసం ఏనుగొండ ఎస్‌వీఎస్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు. క్షతగాత్రుడి పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని సీఐ తెలిపారు.

కాంగ్రెస్‌తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం



ప్రజలతో మాట్లాడుతున్న టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్‌గౌడ్

చిన్నచింతకుంట: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాటం ప్రదీప్‌కుమార్ గౌడ్ అన్నారు. శుక్రవారం మండలంలోని బండ్రపల్లిలో హాథ్ సే హాథ్ జోడో యాత్ర చేపట్టారు. కార్యక్రమానికి ఆయన హాజరై గడపగడపకు తిరిగి టీఆర్‌ఎస్ అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలను మోసం చేస్తూ అవినీతికి పాల్పడుతుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే పేద ప్రజలకు లబ్ధి చేకూరుతుందన్నారు. ప్రజలకు ఆరోగ్యశ్రీ, 108, రైతులకు రుణమాఫీ వంటి పథకాలను అమలు చేసి అండగా నిలిచిందన్నారు. 2024 ఎన్నికల్లో ఆరోగ్యశ్రీ ద్వారా రూ.5లక్షల వరకు వైద్యం, రూ.500లకే గ్యాస్ సిలిండర్, ఒకే దఫాలో రూ.2లక్షల రుణమాఫీ చేస్తుందన్నారు. ప్రజలు వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ చిన్నచింతకుంట, దేవరకద్ర మండలాల అధ్యక్షులు వెంకటేశ్వరెడ్డి, రాందాస్, యూత్ అధ్యక్షుడు వెంకటేష్, టీపీసీసీ ఓబీసీ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, రాధకృష్ణారెడ్డి, టీసీ శ్రీనివాస్, మండల కో ఆప్షన్ మెంబర్ మహెమూద్, శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు విధిగా ఏర్పాటు చేసుకోవాలి



మాట్లాడుతున్న సీఐ రమేశ్‌బాబు

జడ్చర్ల: పట్టణంలో ప్రతి దుకాణం, హోటళ్లు తదితర వ్యాపార వాణిజ్య సముదాయాల వద్ద సీసీ కెమెరాలను విధిగా ఏర్పాటు చేసుకోవాలని స్థానిక సీఐ రమేశ్‌బాబు తెలిపారు. శుక్రవారం స్థానిక నేతాజీ చౌరస్తాలో సీసీ కెమెరాల వినియోగంపై దుకాణాదారులకు అవగాహన కల్పించారు. ఒక్క సీసీ కెమెరా 10మంది పోలీసులతో సమానమని, సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటే ఎవరికి వారు రక్షణ కల్పించుకోవడమే గాక ఇతరులకు కూడా ఉపయోగపడే అవకాశం ఉంటుందన్నారు. బాదేపల్లి మార్కెట్ ప్రాంతంలో గురువారం మహిళ మెడలో నుంచి ఇద్దరు దుండగులు హెల్మెట్ ధరించి చైన్‌స్నాచింగ్‌కు పాల్పడ్డారని గుర్తుచేశారు. ఇలాంటి నేరాలు జరిగినప్పుడు నిందితులను త్వరగా గుర్తించేందుకు వీలు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు లెనిన్, ఖాదర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నిర్మూలనపై ర్యాలీ



భూత్పూర్‌లో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

భూత్పూర్: మండల ప్రాథమిక కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం క్షయవ్యాధి నివారణపై ర్యాలీ నిర్వహించారు. రెండు వారాలకు మించి దగ్గు, రాత్రి చెమటలు పట్టడం, ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉంటే క్షయ వ్యాధి లక్షణాలు వంటి వాల్‌పోస్టర్‌తో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ అబ్దుల్ రబ్, సీహెచ్‌ఓ బొర్ర రామయ్య, సూపర్‌వైజర్ సుధాకర్, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, ప్రమోద్ కుమార్, లలితమ్మ, బసమ్మ పాల్గొన్నారు.

క్షయవ్యాధిని తరిమికొడదాం..

అడ్డాకుల: మండల కేంద్రంలోని పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు. స్థానిక వైద్యురాలు అపర్ణ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది గ్రామంలో ర్యాలీ నిర్వహించి నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ భాస్కర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

హమాలీలను పనుల్లోకి తీసుకోవాలి

జడ్చర్ల: స్థానిక ఎస్‌డబ్ల్యూఎస్ గోదాంలో హమాలీలలకు వెంటనే పని కల్పించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సత్తయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఎర్రగుట్ట ప్రాంతంలో గల గోదాంల ఎదుట ఆందోళన చేపట్టారు. 22ఏళ్లుగా గోదాముల్లో హమాలీలు పనులు చేసి జీవనం గడుపుతున్నారని, ఇలాంటి సమయంలో వారిని తొలగించడం అన్యాయమన్నారు. వెంటనే వారిని తిరిగి పనుల్లోకి తీసుకోవాలని తెలిపారు. లేదంటే కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

భవన నిర్మాణానికి భూమిపూజ

రాజాపూర్: బ్యాంక్‌లకు పక్కా భవనాలు నిర్మించడంతో ఖాతాదారుల్లో మరింత నమ్మకం ఏర్పడుతుందని ఏపీజీవీబీ చైర్మన్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏపీజీవీబీ పక్కా భవన నిర్మాణం కోసం భూమిపూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ మండల కేంద్రంలో ఏపీజీవీబీ ఖాతాదారులకు 30 ఏళ్లుగా వ్యవసాయ, స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలు అందిస్తూ మన్ననలు పొందుతోందన్నారు. బ్యాంకు ఏర్పాటుకు ఉచితంగా దాతలు స్థలాన్ని సమకూర్చడం అభినందనీయమన్నారు. డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఖాతాదారులకు బ్యాంకులు నమ్మకంగా పనిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కొప్పిరి బచ్చిరెడ్డి, రీజినల్ మేనేజర్ సుభాష్, బ్రాంచ్ మేనేజర్ అనూష, ఎంపీపీ సుశీల, వైస్ ఎంపీపీ మహిపాల్ రెడ్డి, బ్యాంకు సిబ్బంది నవనీత, అనూష, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

టీఎల్‌ఎం మెటీరియల్ పంపిణీ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని మెట్టుగడ్డ వద్ద ఉన్న భవిత సెంటర్‌లో దివ్యాంగ విద్యార్థులకు టీఎల్‌ఎం మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విలీన విద్యా కోఆర్డినేటర్ బాలుయాదవ్ మాట్లాడుతూ అంగవైకల్యాన్ని కొన్ని పద్ధతుల ద్వారా తగ్గించేందుకు అవకాశాలు ఉన్నాయని, ఇంటి వద్దే చదువుకునేలా టీఎల్‌ఎం కిట్లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలను దివ్యాంగులు వినియోగించుకుని ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో ఐఈఆర్పీలు శ్రీనివాస్, రఘుబాబు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



మాచన్‌పల్లిలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ సరితారాణి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: మండలంలోని మాచన్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పోషన్ అభియాన్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. పాఠశాల, అంగన్‌వాడీ విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ సరితారాణి మాట్లాడుతూ చిన్నారులు సంపూర్ణ ఆరోగ్యంతో ఎదగాలంటే పోషకాలున్న ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విద్యావతి, అంగన్‌వాడీల టీచర్లు పాల్గొన్నారు.

జడ్చర్ల టౌన్: చిరుధాన్యాలు, ఆకుకూరలు తీసుకోవటం వల్ల శరీరానికి కావాల్సిన పోషకాలు లభిస్తాయని దేవునిగుట్టతండా సర్పంచ్ రాములునాయక్ అన్నారు. పోషణపక్ష వారోత్సవాల్లో భాగంగా స్థానిక కస్తూర్బాగాంధీ విద్యాలయంలో ఉన్న కిశోర బాలికలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కస్తూర్బా విద్యాలయం ఇన్‌చార్జ్ ఎస్‌ఓ తబుస్సుం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుగుణ, అంగన్‌వాడీ టీచర్ యాదమ్మ పాల్గొన్నారు.

జూనియర్ సివిల్ జడ్జికి సన్మానం



సృజనను సన్మానిస్తున్న ఎరుకల ఉద్యోగుల సంఘం ప్రతినిధులు

మహబూబ్‌నగర్ రూరల్: పట్టణంలోని శ్రీనివాస కాలనీకి చెందిన కావేటి సృజన ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం ఉస్మానియా యూనివర్సిటీలో పూర్తి చేసి ఇటీవల వెలువడిన జూనియర్ సివిల్ జడ్జి నోటిఫికేషన్ పరీక్ష రాసి జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఎరుకల ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సృజనను సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట్రాములు, జిల్లా షెడ్యూల్డ్ కులాల ఉప సంచాలకులు వి.పాండు, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ ఎం.బాలయ్య, ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వి.పర్వతాలు, ఉపాధ్యక్షుడు పి.వెంకటస్వామి, శేఖర్, రాములు, చంద్రశేఖర్, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



హన్వాడ: మండలంలోని దొరితండా, పలుగుతండా పాఠశాలల్లో శుక్రవారం స్వయం పరిపాలనా దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు. సర్పంచ్ సుగుణ, పాఠశాల చైర్మన్ జూక్యానాయక్, విజయలక్ష్మి, హెచ్‌ఎం పుల్లయ్య, మల్లేష్ పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమానికి కృషి

- ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి



తాటిపర్తిలో సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

భూత్పూర్: ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తుందని దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని తాటిపర్తి, భూత్పూర్ మున్సిపాలిటీలో పర్యటించారు. తాటిపర్తికి చెందిన మధుకు వైద్య ఖర్చుల నిమిత్తం మంజూరైన రూ.2లక్షల 50వేల విలువ గల ఎల్‌ఓసీ పత్రాలను బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం భూత్పూర్ మున్సిపాలిటీలో రెండు నెలల కిందట రైతు బి.రంగయ్య అనారోగ్యంతో మృతిచెందగా రైతుబీమా ద్వారా మంజూరైన రూ.5లక్షల విలువ గల చెక్కును రంగయ్య భార్యకు అందజేశారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా కూరగాయాల వ్యాపారం కోసం గడ్డం భారతమ్మ, మౌనిక, భీమయ్యలకు మంజూరైన రూ.50వేల చొప్పున చెక్కులను ఎమ్మెల్యే లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని ఎమ్మెల్యే వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్ గౌడ్, ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి, రైతుబంధు అధ్యక్షుడు నర్సింహులు గౌడ్, ముడా డైరెక్టర్లు చంద్రశేఖర్ గౌడ్, సాయిలు, సర్పంచ్ వెంకటయ్య, నాయకులు నారాయణ గౌడ్, గడ్డం రాములు, నర్సింహులు, ప్రేమ్‌కుమార్, యాదయ్య, తిరుపతయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు



హోమం నిర్వహిస్తున్న భక్తులు

కోయిల్‌కొండ: మండలంలోని వీరంపల్లిలో పంచముఖి ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేకపూలతో అలంకరించి పూజలు చేశారు. స్వామివారికి దయం అఖండ దీపారాధన పుణ్యాహవచనం, అభిషేకం, హోమం కార్యక్రమాలను వైభవంగా చేపట్టారు. భక్తులకు నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. శనివారం తెల్లవారుజామున రథోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

జన చైతన్యయాత్రను విజయవంతం చేయండి



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

హన్వాడ: కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధివిధానాలకు నిరసనగా సీపీఎం చేపట్టిన జనచైతన్య యాత్రను విజయవంతం చేయాలని నాయకులు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో యాత్రకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కులమతాలను రెచ్చగొడుతూ ఎన్నో అరాచకాలకు దారితీస్తున్నదని ఆరోపించారు. ఈనెల 26న నిర్వహించే సభకు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాములు, శ్రీనాథ్, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు రాజు తదితరులు పాల్గొన్నారు.